సుభాషిణి

నిద్రనుంచి లేచీలేవగానే చక్కగా కూర్చుని ధ్యాన నిమగ్నులయ్యారు సుబ్రహ్మణ్యంగారు. కొంతసేపటి తర్వాత "ఈరోజు అంతా సవ్యంగా జరిగిపోవాలి" అనుకొని కళ్ళు తెరిచారు.

ఆదివారంగనక ఆయన లేచేసరికి ఉదయం తొమ్మిద యింది. ఆయన భార్య సూర్యకాంతం ఇంట్లోనే వున్నప్పటికీ, ఆయన అంతసేపూ పడుకొనేవున్నా లేపకపోవటానికి కారణం అది ఆదివారం కావటమే!

కళ్ళు తెరిచి, చెవులు 'వంటింటిశబ్ద' గ్రాహకయం త్రంగా సిద్ధంచేసుకొనేసరికి-

"సుధాకరంసార్! ఎక్స్‌ప్రెస్ లెటర్" అని తపాలా బంట్రోత్ కేక వినిపించింది.

"వచ్చితిమి" అనుకొని లేచి, వీధివాకిలి దగ్గరకు వెళ్ళారు.

"మాఅబ్బాయి లేడు. ఉత్తరం సంతకం చేసి నేను తీసుకోవచ్చుగదా!" అని చెయ్యి ముందుకు చాచారు.

"ఓ ఎస్, తీసుకోవచ్చును సార్!" అని సంతకం కోసం ఒక కాగితం ఇచ్చాడు. అందులో ఒకటోఅంకె వున్నచోట సంతకం చేసి, ఉత్తరంతీసుకొని కవరుమీది అక్షరాలు చూస్తూ సుబ్రహ్మణ్యంగారు లోపలికి తిరిగారు. మామూ

లుగా ఆయనకు కుమారుడికి వచ్చే ఉత్తరాలు చూసే అల వాటు లేదు. అది జరూరు వుత్తరం కావడంచేత 'ఏదైనా' ఉద్యోగం వచ్చే విషయానికి సంబంధించినదేమో' అనే ఆశ చేత 'ఎక్కణ్ణుంచా' అని చూశారు.

ఆయన గుండె నిజంగా ఒక్కసారి ఆగి వేగంగా కొట్టు కోసాగింది. చెమట పోసింది. ఆఉత్తరాన్ని గట్టిగా చేతిలో పట్టుకొని, నిలువునా నిల్చొని, కళ్ళుమూసుకొని రెండునిము షాలు 'పరమేశ్వరా' అని ధ్యాననిమగ్నులయ్యారు. అప్పుడే ఎదురుగా సూర్యకాంతం వచ్చి నిల్చొని ఉత్కంఠంతో భర్తను చూసింది. మొదట చేతిలో ఉత్తరం వుండటంచేత సంతోషం కలిగి చిరునవ్వు నవ్వింది. తర్వాత ఆయన ధ్యాననిమగ్నత చూసి గాభరాపడి నిల్చిపోయింది.

ఆయన కళ్ళు తెరిచారు. ఎదురుగా భార్య కనిపించింది. వెంటనే ఉత్తరాన్ని జేబులో వుంచేశారు.

'ఆ ఉత్తరంఏమిటండీ' అని ఆమె అడగాలనుకొంది. కానీ ఆయన ఉత్తరాన్ని జేబులో దాచడంతో 'ఏదోలే' అని వూరుకుంది.

ఇవాళ చాల ఆలస్యంగా లేచారు. ముఖంకడు క్కోండి. కాఫీ తయారయింది" అని లోపలి వెళ్ళిందామె.

ఆయన గదిలోకి వెళ్ళి మళ్ళీ మంచంమీద కూర్చు న్నారు. మరొకసారి కవరు చూశారు. కవరు ఊరికే అటూ ఇటూ త్రిప్పిచూశారు. అయినా చించడానికి మనస్కరించ లేదు. దగ్గరేవుంచుకొని అబ్బాయి రాగానే అడిగి తెల్చుకో

వడమే మంచిదనుకొన్నాను. ఇత్తరాన్ని డ్రాయరులో పడేసి పెరటిలోకి వెళ్ళిపోయారు.

సుధాకరం వచ్చేవరకు-ఆయన ఆలోచిస్తూనే వున్నారు.

'ఎవరీ సుభాషిణి? ఎంతధైర్యంగా ఉత్తరం రాసింది. నిజానికి ఆడపిల్లలు ఉత్తరాలు రాయకూడదని కాదు ఆయన అభిప్రాయం. కానీ తనకొడుక్కి ఈఅమ్మాయెవరో ఉత్తరం రాయటంలో ఉద్దేశం ఏమై వుండొచ్చునూ అని!

ఉదయం కాఫీ కాగానే ఆయన భార్య సూర్యకాంతతో అన్నారు.

నేను నీకెప్పుడైనా...ఇన్నేళ్ళ మనజీవితంలో ఎప్పుడైనా ఉత్తరం రాశానా?

"అయ్యో! మనకంత అదృష్టంకూడానా ! ఒకసారి మీరు మద్రాసుకు పనిమీదవెళ్ళి పదిహేను రోజులుండిపోయారు. అన్నాళ్ళూ ఒక కార్డుముక్కన్నా రాయలేదు. మీ స్నేహితుడికి మాత్రం రోజుకో పెద్ద ఉత్తరం రాశారు. అసలు నేను లేనప్పుడు మీకు జ్ఞాపకం వుంటానా అని. నేను ఒకసారి పుట్టింటికి వెళ్ళి రెండు నెలలున్నాను. మీగురించి ఒక్క విషయం తెలియక చచ్చిపోయాను. కానీ మీరు మటుకు "ఏం సూర్యకాంతం బావున్నావా!" అని ఒకముక్క రాయలేకపోయారు. చెప్పొచ్చారిప్పుడు..."

లెంపలేసుకున్నారాయన.

"పోనీ ఇదిచెప్పు. నువ్వు నా కెప్పుడైనా ఒక ఉత్తరం లాంటిది రాశావా! పోనీ ఇంకెవరికైనా రాశావా"

"అయ్యో! ఎంతమాటన్నారూ! ఇన్నాళ్ళ బ్రతుకులో లేనిది ఇప్పుడేమిటి మీకు ఉత్తరాలమీద మోజుకలిగి నట్లుంది. రోజుకో ఉత్తరం రాస్తారా చెప్పండి. కొన్నాళ్ళు హాయిగా మా పుట్టింటికి వెళ్ళికూర్చుంటాను."

"ఇక లాభంలేదు" అని ఆయన అక్కణ్నుంచి లేచి తన గది లోకి వెళ్ళిపోయారు.

'తన భార్య ఆట్టేచదువుకోకపోవడం ఎంత దురదృష్టం. నిజానికి ఆమె తనదగ్గర లేనప్పుడు తనకు ఆమెతో ఎన్నో చెప్పాలనిపించేది. కానీ ఎలా చెప్పగలుగుతాడు. ఉత్తరం రాస్తే ప్రతీ వాక్యమూ 'తనురాసిన ఉద్దేశంతో' ఆమె ఎలా అర్థం చేసుకోగలుగుతుంది. ఇట్లా ఎన్నో గొప్ప గొప్ప భావాల్ని తను చంపేసుకొన్నాడు.

'మనిషి' అన్నవాడికి మనిషివంటి భార్య అత్యావసరం. బాగా చదువుకొన్నవాడూ విజ్ఞుడూ, సంస్కారీ అయిన మగవాడికి తెలివిగల చదువుకొన్న భార్య అవసరం, అదీ సిసలైన దాంపత్యం. అదే...ఒక పల్లెలో వెంకయ్యకు అతనిలాగే కష్టపడగలిగినదీ, జీవంవున్నదీ అమాయకురాలూ అయిన పిల్ల పెళ్ళామయితే అందులో 'మజా' వుంటుంది. మంచి బరువు వేసిన బండికి మంచి హుషారైన ఎడ్లుకట్టేవుండే 'ఇది' ఇంకెందులో ఉంటుంది!

అందుచేత బియ్యే పాసయి నేడో రేపో ఉద్యోగంలో ప్రవేశించబోతున్న తన కొడుకు చదువుకొన్న ఒక అందమైన, చురుకైన అమ్మాయిని పెళ్ళి చేసుకోవడం సబబుగానే వుంటుంది. పెళ్ళికి ముందు 'పిల్లా' 'పిల్లవాడూ'

ప్రేమించుకోవడం కూడా ఆరోగ్యకరమైనదే. కానీ ఇలా పెళ్ళవక ముందే ఉత్తరాలు రాసుకోవడం తన కెందుకో ఇష్టపడడంలేదు. ముఖ్యంగా ఒక పెళ్ళికాని ఆడపిల్ల, ఒక పెళ్ళికాని యువకుడికి ఉత్తరమనేది రాయడాన్ని, 'తన సనాతనపు బుద్ధి' అంగీకరించ లేకుండా వుంది.

ఇంతకూ ఈ అమ్మాయి ఎవరయి వుండొచ్చు. కాలేజీలో కూడా చదువుకొందేమో...కానేకాదు. అలా అవడానికి వీలు లేనేలేదు. ఆ కాలేజీలో ఆడపిల్లలు చదవరు. వాళ్ళకు వేరే కాలేజీవుంది. ఎక్కడైనా స్నేహితులింట్లో చూసుకొన్నారేమో...ఏమో ... ఎవరయినా కావచ్చు. ఎక్కడైనా కలుసుకొని, ఒకర్ని గురించి ఒకరు తెలుసుకొని, ఒకర్ని ఒకరు ఇష్టపడి ప్రేమ కుదిరిపోయి వుండొచ్చు. అవును అతే... "హరహరా...సాంబశివా...ఏమిటి నన్నింత దుర్బలుణ్ని చేశావేమిటయ్యా! స్వామీ! క్షమించు" అని వెంటనే ఆయన మానసికంగా లెంపలు వేసుకొని ధ్యాన నిమగ్నులయిపోయారు.

అట్లా ఆయన కొంతసేపు మాత్రమే ధ్యానంలో వుండగలిగారు. మళ్ళీ ఆలోచనలో పడిపోయారు.

తనకొడుక్కు ఎవరూ కానీ కట్నం ఇవ్వవలసిన అవసరంలేదు. మగవాడు ఒకడు ఇచ్చేనా బాగుపడుతాడు. స్వశక్తితో బాగుపడుతాడు. అమ్మాయి మంచిది కాకపోతే...ఎంతకట్నం వచ్చి ఏంలాభం? అబ్బాయికి అమ్మాయి నచ్చితేచాలు. ఉన్నది ఒకేకొడుకు. తను అతనికి పెద్ద ఆస్తి మిగల్చకపోయినా బియ్యేవరకు చదివించాడు. కావలిస్తే

ఇంకా చదువుకొంటాడు. ఏదో ఒక ఉద్యోగమంటూ రాకుండాపోదు. స్వంతానికి ఈ ఇల్లుంటుంది. ఇంతకన్న ఏం కావాలి మనిషికి?

అదీగాక ఈ మధ్య సుధాకరం ఒక కథ రాశాడు. అందులో ఒక యువకుడు చస్తే కట్నం పుచ్చుకోనని ప్రతిజ్ఞ చేస్తాడు. అదే కథలో మరో అమ్మాయి తను చస్తే కట్న మడిగేవాణ్ణి పెళ్ళిచేసుకోనని పట్టుపడుతుంది. చివరికి ఈ అమ్మాయికి తగిన వరుడూ లభిస్తాడు; అబ్బాయికి తగిన వధువు లభిస్తుంది; దీనినిబట్టి అబ్బాయికి కట్నం పుచ్చుకోవ డం ఇష్టంలేదని అనుకోవచ్చు. నిజానికి తనకూ ఇష్టంలేదు. ఈ మధ్య ఒకరు నాలుగువేలు కట్నమిస్తామని వస్తే తను అదే చెప్పాడు. "మా అబ్బాయికి మీా అమ్మాయి నచ్చటం అతి ముఖ్యం. కట్నం విషయం కూడా అతని ఇష్టాయిష్టాలమీాదనే ఆధారపడి వుంటుంది" అని. తను ఐదువేల రూపాయలు కట్నం తీసుకొన్నాడు. తీసుకుంటే ఏమయిందీ! దానితో తను బాగుపడ్డాడా? లేదు. ఆ డబ్బుతో వ్యాపారం పెట్టారు. రెండేళ్ళలో ఆ వ్యాపారం దివాలా తీసింది. ఆ దిగులుతోనే తండ్రి ప్రాణం వదిలాడు. ఆయన పోయినతర్వాత తనకు కాళ్ళూచేతులూ ఆడలేదు. చాల పెద్దవాడయ్యేవరకు కూడా తను తండ్రి సంపాదనమీాదే ఆధారపడుతూ, ఆయనకు అన్ని పనులలోనూ సహాయంగా వుంటూ చాల హాయిగా గడిపే శాడు. అలాగే తను బ్రతికి వున్నంతవరకు తన కొడుక్కు కూడా హాయిగా బ్రతికే హక్కు వుంది. ఎందుకో తనను చాలా కాలంగా ఒక అనుమానం, ఒక భయంవంటిది పీడి

స్తోంది. తన కొడుక్కు కట్నం తీసుకొంటే తనుగూడా తండ్రి లాగా రెండేళ్ళలో చచ్చిపోతాడేమో!......సుబ్రహ్మణ్యాం గారు ఈ రీతిని సాయంకాలం సుధాకరం వచ్చేవరకు ఆలో చిస్తూనే వున్నారు.

సుధాకరం రాగానే ఆయన అతన్ని తన గదిలోకి పిలిచారు.

“నీకు ఏదో ఉత్తరం వచ్చినట్లుంది. చూడు,” అని తాపీగా ఉత్తరం తీసి యిచ్చారు. అతను అక్కడే ఆ కవరు చించి ఉత్తరం చదువుకోసాగాడు. ఆయన అతని ముఖంలో భావాలకోసం వెదకుతున్నారు. సుధాకరం ముఖంలో ఎక్కువ మార్పేమీ కనిపించలేదు. ఒక్క చిరునవ్వుతో ఉత్తరం కవ రులో వుంచి, జేబులో వుంచుకొని, చక్కా తన గదిలోకి వెళ్ళిపోయాడు. ప్రశ్నకు జవాబు దొరకని విద్యార్థిలా నిల్చుండి పోయారు సుబ్రహ్మణ్యాంగారు.

మళ్ళీ ఆ రాత్రి భోజన సమయంవరకు ఆ విషయమే ఆలోచిస్తున్నారు.

‘ఆ అమ్మాయెవరో వెంటనే పెళ్ళి చేసుకొందామని రాసిందేమో. అందుచేతనే ఇప్పుడే ఏం పెళ్లి’ అని చిరునవ్వు నవ్వాడేమో సుధాకరం! ‘ఇప్పుడే ఏం’ అని ఎందుకను కోవాలి. ఇంత వయస్సులో ముగ్గురు పిల్లల్ని కన్నవాళ్ళను తనెరుగును. తనుకూడా ఈ వయసులోనే పెళ్ళిచేసుకొన్నాడు. నిజానికి ‘పెళ్ళి వయసు’ అంటే ఇదే. తను ఇదివరకు చాలా పనులలో నిమగ్నుడై వుండటంవల్ల కొడుకు పెళ్ళివిషయం అట్టే శ్రద్ధగా ఆలోచించలేదు. చూడగా చూడగా ఇప్పుడు

తన తక్షణ కర్తవ్యం కొడుక్కు పెళ్ళి చేయడమే ననిపిస్తోంది. పెళ్ళి చేయదలచుకుంటే, సుధాకరం పెళ్ళి చేసుకోడానికి సిద్ధంగా వున్నట్లయితే తన ఎరుకలో ఇదరమ్మాయిలు చాల ఉత్తములైన వారున్నారు. అందులో ఎవరిని కావలసినా సునాయాసంగా కోడలుగా తెచ్చుకోవచ్చు. ముఖ్యంగా సూర్యనారాయణమూర్తి గారమ్మాయి అందంగా వుండటమే గాక చదువుకొన్నది. తెలివైనదీ, వినయవతి కూడాను. అలాంటిదయితే ఇంట్లో ఏ రగడా లేకుండా చాలా సాఫీగా జరిగిపోతుంది.

హఠాత్తుగా ఆయనకు ఒక అతి ముఖ్యమైన విషయం జ్ఞాపకం వచ్చింది. ఆ జ్ఞాపకం ఆయన్ను ఆనందపరవశ హృదయుణ్ణి చేసివేసింది. సూర్యనారాయణమూర్తి గారమ్మాయి పేరు 'సుభాషిణి' అని ఠక్‌మని జ్ఞాపకం వచ్చింది. దానితో ఇంక 'ఇదేదో తొందరగా తేలిపోవాలనే' తొందర ఎక్కువైంది. అయితే ఈ విషయాన్ని ఎలా తేల్చాలో మాత్రం ఆయనకు బోధపడలేదు. తనంత పెద్దవాడు. "అబ్బాయ్. నీ కెవరో ఆడపిల్ల ఉత్తరం రాసినట్లుంది. ఆ అమ్మాయెవరూ...ఏం రాసిందీ కాస్త చెబుదూ" అని ఎలా అడగటం? అందుకని ఇక అడగక్కర్లేదని తేల్చుకొన్నారు. 'సుభాషిణి' అంటే ఆ అమ్మాయే అయివుంటుంది. తనతో సుధాకరం సూర్యనారాయణమూర్తిగారింటికి రెండు సార్లు వచ్చాడుకూడాను. అప్పుడు ఒకర్నొకరు చూసుకోవడం తటస్థించి వుంటుంది. ఆ అమ్మాయికి పీడంటే తప్ప

కుండా ఇష్టం కలిగివుంటుంది. అంతా తల్లి పోలిక; చక్కగా వుంటాడు. ఎవరైనా ఇష్టపడాల్సిందే!

ఒక నిశ్చయానికి వచ్చి ఆయన వెంటనే సూర్యనారాయణమూర్తిగారికి ఒక ఉత్తరం రాసేశారు. ఉత్తరం సారాంశం "అయ్యా...మా అబ్బాయి మీ అమ్మాయి ప్రేమించేసుకొన్నారు. రోజులు మారిపోయాయి. మనం వాళ్ళ ఇష్టప్రకారం నడచుకోవడం ధర్మం. ఏమంటారూ?" అని ఆ ఉత్తరం 'ఉత్తర' వేగాన చిరునామా దారుకు వెళ్ళిపోయింది!

అయితే ఆ రాత్రి భోజనం చేస్తున్నప్పుడు ఒక విషయం జరిగింది.

"నేను రేపు ఉదయం బయలుదేరి విజయవాడ వెళ్ళాలి నాన్నా! అక్కడ స్నేహితుడొకాయన 'సుభాషిణి' అని ఒక పత్రికకు ఎల్లుండి సాయంకాలం ప్రారంభోత్సవం జరిపిస్తున్నాడు. ఈ రోజువచ్చిన ఉత్తరం అక్కణ్నుంచే వచ్చింది;" అన్నాడు సుధాకరం.

సుబ్రహ్మణ్యంగారు విస్తుపోయారు. ఒక్కక్షణం అక్కడే కళ్ళుమూసుకొని "స్వామీ! నేను అనేక దౌర్బల్యాలు కలిగిన సామాన్య మానవుణ్ణి. వాటికి అతీతుణ్ణికాలేను. క్షమించు" అనుకొన్నాడు.

"సరే...వెళ్ళిరా" అని వూరుకొన్నారప్పటికి.

మరునాడు సుధాకరం వెళ్ళిపోయాడు. ఆ మరునాడు సూర్యనారాయణమూర్తిగారి నుంచి ఉత్తరం వచ్చింది.

"సుబ్రహ్మణ్యం గారికి,

నమస్కారాలు. మీ ఉత్తరం ఇంతక్రితమే అందినది. మా అమ్మాయి, మీ అబ్బాయి ప్రేమించుకోవడం చాల హర్షదాయకమైనది. మీరుకూడా సుఖముగా వున్నందుకు మా యింట్లో అందరూ చాల సరదా పడిపోతున్నారు. అన్నట్లు మా అమ్మాయిపేరు మీరు కొంత తప్పురాశారు. బహుశః రాసేటప్పటి పొరబాటయివుంటుంది. మా అమ్మాయి పేరు సుభాషిణికాదు. 'సుహాసిని!' నేను రెండురోజుల్లో అక్కడికి వస్తున్నాను. అన్ని విషయాలూ సమక్షంలో మాట్లాడవచ్చును.

ఇట్లు,
భవదీయుడు,
సూర్యనారాయణమూర్తి."

ఆనందంతో ఆయనకళ్లు ఆర్ద్రములైనాయి. "పేరేదయితేనేం! నువ్వు తప్పకుండా 'సుభాషిణి' వవుతావు తల్లీ!" అని కళ్ళు మూసుకొని ధ్యాననిమగ్ను లయిపోయారు.